ప్రజాశక్తి

మంగళవారం 21 నవంబర్ 2023





డిఆర్ఒ కొండయ్యకు సమస్యను వివరిస్తున్న ఇంతియాజ్

ఖద్దర్‌పై ఖాకీ మోజు

◆ ఎన్నికల బరిలో నిలవాలన్న కుతూహలం

◆ గుట్టుగా నియోజకవర్గాలపై కసరత్తు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఖాకీకి.. ఖద్దరుకు అవినాభావ సంబంధం ఉంటుంది. నేతలతో నిరంతరాయంగా సత్సంబంధాలు కలిగుండే పోలీసులు, తామే నేతలుగానూ మారేతే ఎలాగుంటుందన్న ఆలోచనలు నడుస్తున్నట్లు సమాచారం. కొంత మంది ఖాకీలు పోలీసు యూనిఫాం వదిలేసి ఖద్దరుపై మోజు పెంచుకుంటున్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల బరిలో దిగేందుకు ఖాకీలు సమయత్తమవుతున్నారు. ఇందుకు అవసరమైన కసరత్తును గుట్టుగా కానిచ్చేస్తున్నారు. మరో ఆరు మాసాల్లోపు సార్వత్రిక ఎన్నికలు రానున్నాయి. దీంతో ముందుగానే ముఖ్య నేతలను కలుసుకుని వారి ఆశీస్సులతో రాజకీయరంగ ప్రవేశం చేయాలన్న యోచనలోనున్నట్లు కనిపిస్తోంది. గతంలో ఇదే రకంగా ఒకరు ఖాకీ వదిలి ఖద్దరు వేసుకుని పార్లమెంటు సభ్యుడు అయ్యారు. సిఐగానున్న గోరంట్ల మాధవ్ చివరి నిమిషంలో ఉద్యోగానికి రాజీనామా చేసి హిందూపురం పార్లమెంట్ టిక్కెట్టును పొందారు. పార్లమెంటు సభ్యుడిగానూ ఎన్నికయ్యారు. అదే తరహాలోనే ఉద్యోగ విరమణ తరువాత రిటైర్డు ఐజి మహమ్మద్ ఇక్బాల్ వైసిపిలో చేరి హిందూపురం అసెంబ్లీకి పోటీ చేశారు. ఆయన అక్కడ గెలవలేకపోయారు. ఆ తరువాత ఎమ్మెల్సీ పదవినిచ్చారు. హిందూపురం ఇన్‌ఛార్జిగా మొన్నటి వరకున్నారు. పై ఇద్దరు కూడా నేతలుగా మారాక, రాజకీయాల్లో రాణించలేకపోయారన్నది రాజకీయవర్గాల్లో చర్చ నడుస్తోంది. పోలీసు అధికారులుగా సక్సెస్ అనిపించుకున్నప్పటికీ రాజకీయ నేతలుగా రాణించలేకపోయారన్న వాదన ఉంది.

పోటీకి నలుగురు

ఉమ్మడి జిల్లాలో కొత్తగా మరో నలుగురు అధికారులు ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతున్నట్లు రాజకీయవర్గాల్లో చర్చ నడుస్తోంది. ఒకరేమో ఏకంగా దీర్ఘకాలిక సెలవుపై కూడా ఉన్నట్లు సమాచారం. అనారోగ్య కారణాల పేరుతో సెలవుపై వెళ్లి ఆయన తరుపున భార్యను రంగంలోకి దింపేందుకు సిద్ధమవుతున్నట్లు రాజకీయవర్గాల్లో చర్చ నడుస్తోంది. పక్క జిల్లాల నుంచి ఇద్దరు అధికారులు కూడా రిజర్వు నియోజకవర్గాలైన శింగనమల, మడకశిర నియోజకవర్గాల్లో పోటీ చేస్తే ఎలాగుంటుందన్న ఆలోచనలోనున్నారు. గతంలో ఇక్కడ పనిచేసి వెళ్లిన ఈ ఇద్దరు కూడా బరిలో నిలిచేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ప్రధానంగా రిజర్వు స్థానాలపైనే ఎక్కువగా ఆసక్తి చూపుతున్న వారున్నారు. స్థానికంగానున్న మరో కింది స్థాయి అధికారి సైతం రేసులో నిలిచే ఆలోచనలోనున్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎటువైపు మొగ్గుందన్నది కూడా బేరీజు వేసుకునే పనిలోనున్నారు. బలమున్న వైపు దిగితే పదవిని సులభంగా దక్కించుకోవచ్చునన్న ఆలోచనలోనున్నట్లు తెలుస్తోంది. గతంలో కలిసొచ్చినట్టే ఇప్పుడు కలిసొస్తుందా.? లేదా.? అన్నది చూడాల్సి ఉంది. ఇక రాజకీయ పార్టీలు కొత్త వారికి అవకాశమిస్తారా.? లేక పాతవారినే కొనసాగిస్తారా.? అన్నది కూడా చర్చ నడుస్తోంది. మార్పు ఉంటుందన్న నియోజకవర్గాలపైనే వీరు దృష్టి సారించి, టిక్కెట్టును దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే రాజకీయాలంటే ఇప్పుడు డబ్బుతో ముడిపడిన అంశాలన్నది సర్వత్రా తెలిసిన అంశమే. ఇంత పెద్ద మొత్తంలో ఈ అధికారులు ఖర్చు పెట్టగలరా లేదా అన్న చర్చ కూడా నడుస్తోంది. ఏది ఏమైనా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎంత మంది ఖాకీలు తమ యూనిఫామ్‌ను మార్చి ఖద్దరు ధరిస్తారా అన్నది చూడాల్సి ఉంది.

నిర్వాసితులకు న్యాయం చేయండి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో కేంద్ర ప్రభుత్వ సంస్థలు బెల్, నాసన్, పరిశ్రమల స్థాపనలో భాగంగా భూములు కోల్పోయిన పేద రైతులకు నష్టపరిహారంతో పాటు పునరావాసం కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ తరపున కలెక్టరేట్‌లో డిఆర్ఒ కొండయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ సోమందేపల్లి మండలం చిన్న బాబయ్యపల్లికి చెందిన చిన్నసన్నకారు నిరుపేద దళిత కుటుంబాల నుంచి కేంద్ర ప్రభుత్వ సంస్థల స్థాపన అవసరం నిమిత్తం వారి భూములను తీసుకున్నారన్నారు. ప్రభుత్వం బలవంతపు భూ సేకరణ చేసిందన్నారు. చట్ట ప్రకారం నష్టపరిహారం ఇవ్వకుండా దళితులను మోసం చేసి భూములు గుంజుకుని వలస కూలీలుగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు నిర్వాసితులకు ఇవ్వాల్సినసిన పునరావాసం కల్పించకుండా అన్యాయం చేశారని విమర్శించారు. నిర్వాసితులు అధికారులు న్యాయం చేయనందున హైకోర్టును ఆశ్రయించారన్నారు. హైకోర్టు నష్టపరిహారంతో పాటు నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. అయినప్పటికీ అధికారులలో చలనం లేదన్నారు. భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం పునరావాసం తక్షణమే కల్పించాలని కోరారు. జిల్లాలో పలు మండలాలలో ఇలాంటి సమస్యలు ఉన్నాయని ఆ ప్రాంతాల్లోనూ రైతులకూ న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, నిర్వాసితుల ప్రతినిధులు నారాయణప్ప, వెంకటరామిరెడ్డి, మంగమ్మ పాల్గొన్నారు.

ఉచిత మెడికల్ క్యాంపునకు విశేష స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

ప్రజాశక్తి-పుట్టపర్తి

శ్రీ సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభిస్తోంది. పుట్టపర్తి పరిసర ప్రాంతాలే కాకుండా ధర్మవరం, కదిరి, అనంతపురం, కర్ణాటక రాష్ట్రం బాగేపల్లి, చిక్బల్లాపూర్ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో రోగులు ఈ శిబిరానికి హాజరవుతున్నారు. శిబిరంలో దేశ విదేశీ వైద్యులు రోగులను పరీక్షించి దీర్ఘకాలిక రోగాలకు కూడా ఉచితంగా మందులు అందిస్తున్నారు. అమెరికాకు చెందిన గీత కామత్ ఆధ్వర్యంలోని 64 మంది డాక్టర్లు నిరంతరం వైద్య సేవలు అందిస్తున్నారు. ఇండియా డాక్టర్లు 35 మంది, యూకే డాక్టర్లు 16 మంది, నేపాల్ డాక్టర్లు నలుగురు, ఏడుగురు యూఎస్ఏ డాక్టర్లు, ఆస్ట్రేలియాకు చెందిన ఆరు మంది స్పెషలిస్ట్ డాక్టర్లు వైద్య శిబిరంలో రోగులకు చికిత్సలు అందిస్తున్నారు. ఇంకా నాలుగు రోజులపాటు వైద్య శిబిరాన్ని కొనసాగిస్తామని వైద్యబందం ఇన్‌ఛార్జి గీత కామత్ తెలిపారు. చికిత్స శిబిరం వద్ద రోగుల సౌకర్యార్థం తాగునీరు, ఉచిత భోజన వసతిని కల్పిస్తున్నారు. నడవలేని వద్దులకు ప్రత్యేకమైన బ్యాటరీ వాహనాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు 4000 మందికి వైద్య సేవలు అందించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డిక్లేర్ గోవింద్ ఆఫ్రికా, కృష్ణా సతిరాజ్ యూఎస్ఏ, ఖాదర్నాథ్ ఆస్ట్రేలియా, ప్రశాంతి నేపాల్, అంబ్రిష్‌రప్ప, నారాయణ దాల్వావ్ తదితర వైద్యులు పాల్గొన్నారు.

నేడు గవర్నర్, రేపు రాష్ట్రపతి రాక

పుట్టపర్తిలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సత్యసాయి బాబా 98వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని పుట్టపర్తికి సోమవారం నాడు గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, 22 మంగళవారం రాష్ట్రపతి ద్రౌపతిముర్మ రానున్నారు. గవర్నర్, రాష్ట్రపతి పర్యటన వివరాలను అధికారులు సోమవారం నాడు వెల్లడించారు. 21న గవర్నర్ గన్నవరం విమానాశ్రయం నుంచి బెంగళూరుకు వెళతారు. అక్కడ నుంచి 22న చిలమత్తూరు మండలం మొరంపల్లి వద్ద ఉన్న రక్ష అకాడమీకి చేరుకుంటారు. అక్కడి నుంచి 12 గంటలకు రోడ్డు మార్గాన పుట్టపర్తికి చేరుకుంటారు. మధ్యాహ్నం 2:45 గంటలకు సత్యసాయి విమానాశ్రయానికి చేరుకుని రాష్ట్రపతి ద్రౌపతిముర్మకు స్వాగతం పలకనున్నారు. రాష్ట్రపతి 22న మధ్యాహ్నం 2:45 గంటలకు చేరుకుంటారు. అక్కడ నుంచి 2:50 నిమిషాలకు ప్రశాంతి నిలయానికి చేరుకుంటారు. 3:15 నిమిషాలకు సాయి కుల్వంత్ హాలులో బాబా సమాధిని దర్శించుకుంటారు. 4:15 గంటలకు సత్యసాయి యూనివర్సిటీ 42వ వార్షికోత్సవంలో ముఖ్యఅతిథిగా రాష్ట్రపతి పాల్గొంటారు. 5:30 గంటలకు ప్రశాంతి నిలయం నుంచి సత్యసాయి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి ఢిల్లీకి బయలుదేరి వెళ్తారు. గవర్నర్ 22న 6:45 గంటలకు చిలమత్తూరు రక్ష అకాడమీకి చేరుకుంటారు.

రాష్ట్రపతి ,గవర్నర్ రాక సందర్భంగా పుట్టపర్తిలో పటిష్ట బందోబస్తు

పుట్టపర్తి రూరల్: సత్యసాయి బాబా జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు పుట్టపర్తికి గవర్నర్, రాష్ట్రపతి రానున్న నేపథ్యంలో పోలీసులు పటిష్ట పోలీస్ భద్రతను ఏర్పాటు చేస్తున్నారు. భద్రతా ఏర్పాట్లకు సంబంధించి ఎఎస్ఎల్ భద్రత సిబ్బందితో కలిసి కలెక్టర్ పి.అరుణ్ బాబు, డిఐజి ఆర్ఎన్ అమ్మిరెడ్డి, రవి ప్రకాష్ , శ్రీ సత్య సాయి, అనంతపురం జిల్లా ఎస్పీలు ఎస్వి.మాధవ్‌రెడ్డి, అన్బురాజన్‌లు పుట్టపర్తి విమానాశ్రయంలో సోమవారం నాడు సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రశాంతి నిలయం, సత్యసాయి విమానాశ్రయంలో రాష్ట్రపతి దిగే ప్రాంతంలో చేపట్టాల్సిన భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. అక్కడి నుంచి రాష్ట్రపతి రోడ్డు మార్గం ద్వారా ప్రశాంతి నిలయంకు చేరుకోనున్న నేపథ్యంలో రోడ్డుకు ఇరువైపులా భారీ గేట్లు ఏర్పాటు చేశారు. సాయి కుల్వంత్ హాల్, శ్రీనివాస్ గెస్ట్ హౌస్, సాయి హీరా కన్వెన్షన్ హాల్ ప్రాంతాలను ట్రస్ట్ సభ్యులతో కలిసి అధికారులు పరిశీలించారు. భక్తులు, పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ఏర్పాట్లను పూర్తి చేయాలని కలెక్టర్, డిఐజిలు అధికారులకు సూచించారు.



ద్రౌపతిముర్మ



ఎస్.అబ్దుల్ నజీర్

ఈ క్రాప్ నమోదులో అర్హులకు అన్యాయం

పుట్టపర్తి రూరల్ : ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు సంబంధించి వ్యవసాయ అధికారులు ఇష్టారాజ్యంగా ఈ క్రాప్ నమోదు చేయడంతో అర్హులకు అన్యాయం అన్యాయం జరుగుతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కదిరి నియోజకవర్గం గాండ్లపెంట మండలానికి చెందిన పలువురు రైతులు సోమవారం నాడు ఈ విషయంపై స్పందన గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కలిసి వనతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గాండ్లపెంట మండలంలో ఈ క్రాప్ నమోదులో పట్టు పరిశ్రమ శాఖకు చెందిన మధుసూదన్‌రెడ్డి అనే ఉద్యోగి ఇష్టారాజ్యంగా వ్యవహరించి అర్హుల పేర్లు నమోదు చేయకుండా అన్యాయం చేశారన్నారు. డబ్బులు తీసుకుని ఏ పంటా సాగు చేయని వారి పేర్లు ఈక్రాప్ నమోదు చేశారన్నారు. అర్హులైన రైతులను మాత్రం పట్టించుకోలేదన్నారు. ఇదే విషయమై గతంలోనూ కలెక్టరేట్‌లో అర్జీలు ఇచ్చామని గుర్తు చేశారు. దీనిపై అధికారులు విచారణ చేయగా ఈ క్రాప్ నమోదులో అక్రమాలు జరిగినట్లు తేలిందన్నారు. అయినా ఇప్పటి వరకు రైతులకు న్యాయం చేయలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. ఈ విషయమై జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు మాట్లాడుతూ ఈ క్రాప్‌నమోదులో అక్రమాలకు పాల్పడిన ఉద్యోగిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని పట్టు పరిశ్రమ శాఖ అధికారికి నివేదికలు పంపామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు శివారెడ్డి, అమీర్ ఖాన్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగునకు చర్యలు

మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్

ప్రజాశక్తి-హిందూపురం



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్

పురపాలక సంఘం వ్యాప్తంగా పారిశుధ్యం మెరుగునకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ శానిటేషన్ సెక్రేటరీలను ఆదేశించారు. సోమవారం కమిషనర్ తన ఛాంబర్‌లో దీనిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్య ఎక్కడా లోపించకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి రోజూ ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి కాలువలను శుభ్రం చేయించాలన్నారు. చెత్త తరలించే వాహనాలు తప్పని సరిగా రోజుకు 3 ట్రిప్పులు తప్పని సరిగా కంపోస్టు యార్డుకు చెత్తను తరలించాలన్నారు. ఈ సమావేశంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు. పురపాలక సంఘం వ్యాప్తంగా అన్ని వార్డుల్లో ఉన్న అక్రమ కొళాయి కనెక్షన్‌లను గుర్తించి, వెంటనే తొలగించాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ అమ్యూనిటీ సెక్రేటరీలకు ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కుల గణనను పురపాలక సంఘ వ్యాప్తంగా పకడ్బందిగా చేపట్టాలని సచివాలయ అడ్మిన్ సెక్రటరీలను ఆదేశించారు. కుల గణనపై చిలమత్తూరు ఎంపిడిఒతో అడ్మిన్ సెక్రేటరీలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.

బలిజలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

ఎపి ఆగ్రోస్ ఛైర్మన్ నవీన్ నిశ్చల్



సమావేశంలో మాట్లాడుతున్న నవీన్ నిశ్చల్

హిందూపురం : రాష్ట్రంలో అత్యధిక శాతం ఉన్న బలిజలకు అన్ని రాజకీయ పార్టీలు ప్రాధన్యత కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎపి ఆగ్రోస్ ఛైర్మన్ నవీన్ నిశ్చల్ కోరారు. కార్తీక సోమవారం సందర్భంగా హిందూపురం పట్టణంలోని లక్ష్మిపురం బాలాజీ స్వామి ఆలయంలో హిందూపురం బలిజ సంఘం ఆధర్వ్యంలో వన భోజనాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ ఆగ్రోస్ ఛైర్మన్ నవీన్ నిశ్చల్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే అత్యధిక శాతం ఉన్న బలిజలకు అన్ని పార్టీలలో రాజకీయ ప్రాధాన్యత కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బలిజలను ఏకం చేస్తూ హిందూపురంలో బలిజ గర్జన ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున బలిజ సంఘం నాయకులు, బలిజలు పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు వేగవంతంగా పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

స్పందనలో వచ్చిన అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ అరుణ్ బాబు ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లో జగనన్నకు చెబుదాం ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్, డిఆర్ఒ కొండయ్య, ఆర్డీవో భాగ్యరేఖ సచివాలయాల కోఆర్డినేటర్ శివారెడ్డి, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య తదితరులతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి 322 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి వాటిని పారదర్శకంగా విచారణ చేసి నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలన్నారు. పెండింగ్ బిహైండ్, ఎస్-ఎల్ఎ, రీ ఓపెనింగ్ లేకుండా అర్జీదారులు సంతప్తి చెందే విధంగా పరిష్కరించాలని కోరారు.



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్

దివ్యాంగులకు న్యాయం చేద్దాం

చట్టం కల్పించిన సౌకర్యాలను ప్రభుత్వ ఆదేశాలనుసారం దివ్యాంగులు ఉపయోగించుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అరుణ్ బాబు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ మండలాలలో చదువుతున్న ప్రత్యేక అవసరాలు కలిగిన 15 మంది విద్యార్థులకు ట్యాబులు అందజేశారు. జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్, జిల్లా విద్యాధికారి మీనాక్షితో కలిసి వీటిని పంపిణీ చేశారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా డిజిటల్ టెక్నాలజీ వినియోగంలో భాగంగా విద్యార్థులకు ట్యాబులను అందజేస్తున్నట్లు చెప్పారు. విద్యా ప్రమాణాలు పెంచే విధంగా ఉపాధ్యాయులు విద్యార్థుల్లో ఉన్న సజనాత్మకతను వెలికి తీసే విధంగా కషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విలీన విద్య కోఆర్డినేటర్ ఆనందబాబు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ కార్మికులకు వేతనాలివ్వండి

ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్



ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న స్వచ్ఛభారత్ కార్మికులు

గ్రామపంచాయతీ స్వచ్ఛభారత్ కార్మికుల సమస్యలను పరిష్కరించి, వారికి పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే మంజూరు చేయాలని గ్రామపంచాయతీ స్వచ్ఛభారత్ కార్మికుల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.ఇంతియాజ్ డిమాండ్ చేశారు. పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయం ముందు స్వచ్ఛభారత్ కార్మికులు సోమవారం నాడు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులకు రూ.20 వేల కనీస వేతనం ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను ఇవ్వాలన్నారు. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలన్నారు. పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. గుర్తింపు కార్డులు, యూనిఫాం, నూనె, సబ్బులు, చెప్పులు ఇవ్వాలని కోరారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి కలెక్టర్ అరుణ్ బాబుకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు రమేష్, సుధామణి, బాబావలి, మహబూబ్ బాషా, హరి, వెంకటేష్, పైపల్లి గంగాధర్, ఆదినారాయణ, వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణం చేపట్టాలి

హిందూపురం : గత సంవత్సరం కురిసిన వర్షాలకు కూలిన వంతెనను అధికార వైసిపి ఇప్పటి వరకు నిర్మాణం చేపట్టలేదని వెంటనే వంతెన నిర్మాణం చేపట్టాలని టిడిపి, జనసేన నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వంతెన వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంతెన కూలి సంవత్సరాలు గడుస్తున్న నూతన వంతెన నిర్మాణం చేపట్టకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కనీసం ఆర్అండ్‌బి అధికారులు కూలిన వంతెన వద్ద జాగ్రత్తలు ఏర్పాటు చేయక పోవడంతో రాత్రి సమయంలో వంతెనపై నుంచి వచ్చి కిందకు పడి మృతి చెందుతున్న ఏ ఒక్కరూ పట్టించు కోవడం లేదన్నారు. ఇప్పటికైన వంతెన పనులు చేపట్టి, పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అంబికా లక్ష్మినారాయణ, రమేష్‌కుమార్, రాము, జనసేన నాయకులు ఉమేష్ పాల్గొన్నారు.



పెన్న నది వంతెన వద్ద ఆందోళన చేస్తున్న టిడిపి, జనసేన నాయకులు

అంధుల పాఠశాలలో ఉచిత వైద్యశిబిరం

హిందూపురం : పట్టణ సమీపంలోని సేవా మందిరం ప్రభుత్వ అంధుల పాఠశాలలో సోమవారం నాడు వాసవ్య మహిళా మండలి, విప్రో కేర్ సహకారంతో కుశాల్ హెల్త్ కేర్ క్లీనిక్ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరంలో 40 మంది విద్యార్థులు, పాఠశాల సిబ్బంది 17 మందికి షుగర్, హిమోగ్లోబిన్, బ్లడ్ గ్రూప్, సాధారణ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గౌతమి ఆహార, ఆరోగ్య నియమాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుశాల్ ప్రాజెక్టు సిబ్బంది ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయకుమార్, రంగయ్య, లక్ష్మమ్మ, మల్లిక, కృష్ణవేణి, రాధమ్మ, శిరీష పాల్గొన్నారు.

వైసిపి పాలనలోనే రోడ్ల అభివృద్ధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కదిరి అర్బన్

వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాతనే కదిరిలో రోడ్లను అన్ని విధాలా అభివృద్ధి చేశామని, ఈ వాస్తవాలు తెలుసుకుని టిడిపి, జనసేన నాయకులు మాట్లాడితే బాగుంటుందని ఎమ్మెల్యే పివి.సిద్ధారెడ్డి తెలిపారు. సోమవారం నాడు ఎమ్మెల్యే తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో గత 30 సంవత్సరాల్లో ఎన్నడూ జరగనంత అభివృద్ధి జరిగిందన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన మూడు నెలల కాలం నుంచే కదిరి ప్రజల చిరకాల స్వప్నంగా మిగిలిపోయిన బైపాస్ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టామన్నారు. రూ.230కోట్లతో త్వరలోనే ఈ పనులను పూర్తి చేయబోతున్నమన్నారు. కాలేజీ సర్కిల్ నుంచి చావడి వరకు రోడ్డు విస్తరణ పనులు చేశామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా రూ.100 కోట్లకుపైగా వెక్షించి 150 గ్రామాల్లో తారు రోడ్లు వేశామన్నారు. కదిరి మున్సిపాలిటీలో నాలుగు అర్బన్ హెల్త్ సెంటర్లు, రూ.18 కోట్లతో స్థానిక ఏరియా ఆసుపత్రిని అద్భుతమైన భవనాన్ని నిర్మించుకున్నామన్నారు. నాడు-నేడుతో పాఠశాలలను అభివృద్ధి చేశామన్నారు. తెలుగుదేశం పార్టీ గతంలో అధికారంలో ఉన్న ఐదు సంవత్సరాలు, ఉమ్మడి ఆంధ్రరాష్ట్రంగా ఉన్న 9 సంవత్సరాల్లో ఏమి అభివృద్ధి చేసిందో చెప్పాలన్నారు. వైసిపి పాలనలో రోడ్లు వేస్తుంటే వాటిని ఆపేందుకు కోర్టులకు వెళ్లింది టిడిపి నాయకులు కాదాని ప్రశ్నించారు. కదిరిలోని కోనేరు అభివృద్ధి పనులను కూడా చేపట్టామన్నారు. త్వరలో మీడియా మిత్రులతో కలిసి కదిరి నియోజకవర్గంలో చేసిన అభివద్ధి పనులను చూపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పాలకమండలి సభ్యులు గోపాలకష్ణ, గాండ్లపెంట ఎంపీపీ జగన్ వైసిపి నాయకులు



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ప్రవీణ్‌కుమార్‌కు గత నెల క్రితం తలకు దెబ్బ తగిలి శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. ఈ విషయాన్ని ఎపి ఆగ్రోస్ ఛైర్మన్ నవీన్ నిశ్చల్‌కు తెలిపగా ఆయన స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధికి ధరఖాస్తు చేయించారు. ఈ మేరకు బాధితునికి రూ.3.50లక్షల చెక్కును సోమవారం నాడు అందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఇర్షాద్, వైసిపి నాయకులు అజాం, జబి పాల్గొన్నారు.

8 నుంచి అంగన్వాడీల నిరవధిక సమ్మె

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్

ఐసిడిఎస్ కార్యాలయాల వద్ద ధర్నాలు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా వ్యాప్తంగా ఐసిడిఎస్ కార్యాలయాల వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాలు చేపట్టారు. పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సమీపంలోని ఐసిడిఎస్ కార్యాలయం ఎదురుగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం డిసెంబర్ 8వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేపడతామని సిడిపిఒకు సమ్మె నోటీసు అందజేశారు. ఈఎస్ వెంకటేష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీల సమస్యల ను నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. వేతనాల పెంపు, గ్రాట్యూటీ, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు, మెయిన్ టీచర్లకు ఇచ్చే వేతనం ఇవ్వాలని, మినీ వర్కర్లకు ప్రమోషన్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ. 5 లక్షలు, ఆఖరి వేతనంలో 50 శాతం పెన్షన్, హెల్పర్ల ప్రమోషన్‌లో నిబంధనలు రూపొందించి రాజకీయజోక్యం అరికట్టాలని, సర్వీసులో ఉండి చనిపోయిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, బీమా, రిటైర్మెంట్ వయసును 62 ఏళ్లకు పెంపు, వేతనంతో కూడిన మెడికల్ లీవ్, తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మార్చి 23వ తేదీ శాసనమండలిలో ఐసిడిఎస్ మంత్రి అంగన్వాడీ యూనియన్లతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని ఇచ్చిన హామీని ఇంతవరకూ నెరవేర్చలేదన్నారు. దీంతో డిసెంబర్ 8వ తేదీ నుంచి అంగన్వాడీలు నిరవధిక సమ్మె చేయాలని సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు అనుబంధ అంగన్వాడీ యూనియన్లు నిర్ణయించాయ న్నారు. ఆయా డిమాండ్ల పరిష్కారం కోసం జరిగే సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన ప్రాజెక్ట్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా సుజాత, ఉపాధ్యక్షురాళ్లుగా షర్మిల, సుబ్బలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా నాగమణి, సహాయ కార్యదర్శులుగా యశోద, అనంతమ్మ, ఉమాదేవి, శ్రానణి, కోశాధికారిగా మంజుల, కమిటీ సభ్యులుగా ఎస్.జ్యోతి, భగవతి, డి.అరుణ, అనిత, స్వాతి, ఉష, లక్ష్మీనరసింహ, సాయిజ్యోతి, పద్మావతి, నిర్మల, శివమ్మలను ఎన్నుకున్నారు.

ఓబుళదేవరచెరువు : అంగన్వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.లక్ష్మీనారాయణ, రమణ, అంగన్వాడీ కార్యకర్తలు ధర్నా చేపట్టారు. అనంతరం సిడిపిఒ వరలక్ష్మికి వినిత పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు కుళ్లాయప్ప, కార్యదర్శి శ్రీరాములు, అంగన్వాడీ యూనియన్ లీడర్స్ మణిమాల, ఆశీర్వాదమ్మ, వరలక్ష్మి, లక్ష్మీదేవి, సుజాత, కమలమ్మ, మేరీ సుజాత, కిష్టమ్మ, సరళ, అశ్విని, ప్రమీల, రమణమ్మ, సరస్వతి, విమలమ్మ, ఆదిలక్ష్మి, భారతి, రత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని, లేనిచో డిసెంబర్ 8వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని అంగన్వాడీ సిబ్బంది స్పష్టం చేశారు. ఈ మేరకు సిఐటియు, ప్రజా సంఘాలు, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీదేవి ఆధ్వర్యంలో సిడిపిఒ గీతాబాయికి సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు కొండా వెంకటేష్, షీలా నారాయణస్వామి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మడకశిర : అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్స్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో పట్టణంలోని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి సిడిపిఒకు నిరవధిక సమ్మె నోటీసును అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శ్రీదేవి, ఉపాధ్యక్షులు ఉషారాణి, జిల్లా కమిటీ మెంబర్ పద్మ, కోశాధికారి ఆరిఫా, రొళ్ల మండల అధ్యక్షురాలు ఇందిరమ్మ, అగళి మండల అధ్యక్షురాలు వెంకమ్మ, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

హిందూపురం : అంగన్వాడీల సమస్యలపై సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప ఆధ్వర్యంలో స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ముందు అంగన్‌వాడీ సిబ్బంది ధర్నా చేపట్టారు. నరసింహప్ప, ప్రాజెక్టు వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు శోభారాణి మాట్లాడుతూ అంగన్వాడీ సమస్యలు పరిష్కరించి, అంగన్‌వాడీ విద్యను బలోపేతం చేయాలని కోరారు. వచ్చే నెల 8న జరిగే నిరవధిక సమ్మెకు ప్రతిఒక్కరూ మద్దతు తెలపాలని కోరారు. ధర్నాకు ఎఐటియుసి నాయకులు మద్దతు తెలిపారు. ధర్నాలో ప్రాజెక్ట్ కార్యదర్శి లావణ్య, కోశాధికారి శిరీష, సెక్టార్ లీడర్స్ శైలజ, నాగమ్మ, విజయమ్మ, వరలక్ష్మి, గీతావాణి, పద్మక్క, తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో సిడిపిఒ రాధిక కి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు మాబున్నీసా, సిఐటియు నాయకులు జగన్మోహన్, తాజుద్దీన్, ఫాజిల్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నల్లచెరువు : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివిఎల్.నర్సింహులు ఆధ్వర్యంలో కదిరి ఐసిడిఎస్ కార్యాలయంలో సిడిపిఒకి వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో కదిరి డివిజన్ నాయకులు జగన్‌మోహన్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బాబ్‌జాన్, సిఐటియు మండల కన్వీనర్ రామకృష్ణ, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు శ్రీరాములు, అంగన్వాడీ లీడర్లు పద్మావతి, సరస్వతీ, భాగ్యమ్మ, లక్ష్మీ దేవి, లీలావతి, తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : అంగన్వాడీల సమస్యలపై స్థానిక ఐసిడిఎస్ ఆఫీసు ముందు సిఐటియు శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ దిల్షాద్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఆమె మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం నిరవధిక సమ్మెలో భాగంగా డిసెంబర్ 8వ తేదీ నుంచి వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహిస్తున్నామన్నారు. ధర్నాలో సిఐటియు మండల నాయకులు రాజయ్య, వాసంతి, రంజిత, పుష్ప, ప్రభావతి, జయ, స్వరపతి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు

పెనుకొండ : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో సిడిపిఒకు వినతిపత్రం సమర్పించారు. సిఐటియు మండల కార్యదర్శి బాబావలి మాట్లాడుతూ అంగన్వాడీలకు వేతనాల పెంపు, గ్రాట్యూటీ, పెన్షన్, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు తిప్పన్న, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు బావమ్మ, మాబున్నీసా, సావిత్రమ్మ, పార్వతమ్మ, అంగన్వాడీ వర్కర్స్ పాల్గొన్నారు.



సిడిపిఒకు వినతిపత్రం ఇస్తున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్, తదితరులు

నేరాలు ఘోరాలు

మహిళ ఆత్మహత్య

చిలమత్తూరు : స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయ సమీపంలోని సొంతింట్లో సోమవారం సాయంత్రం భాను(40) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. ఆమె మృతికి కారణాలు తెలియాల్సి ఉండగా ఫిర్యాదు అందలేదని, ఫిర్యాదు అనంతరం కేసు నమోదు చేసి పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎస్ఐ గంగాధర్ తెలిపారు.

ఫలించిన సిపిఎం ఆందోళన

పూడ్చిన మృతదేహానికి పోస్టుమార్టం



తహశీల్దార్, సిఐ, వైద్యుల సమక్షంలో పూడ్చిన మృతదేహాన్ని బయటకు తీసున్న దృశ్యం

హిందూపురం : రూరల్ మండల పరిధిలోని కొటిపి గ్రామంలో ఈ నెల 14వ తేదీ బోయ నాగరాజు అనుమానాస్పద మృతిపై కేసు నమోదు చేసి, మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం చేపట్టి, దోషులను కఠినంగా శిక్షించాలని సిపిఎం ఆధ్వర్యంలో మూడు రోజుల నుంచి ఆందోళనలు చేపట్టారు. దీనిపై స్పందించిన తహశీల్దార్ స్వర్ణలత, రూరల్ సిఐ శ్రీనివాసులు, వైద్యులు, గ్రామ పెద్దలు, సిపిఎం నాయకులు, మృతుడి తల్లిదండ్రుల సమక్షంలో బయటకు తీసి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రోహిల్ కుమార్ పోస్టు మార్టం నిర్వహించారు. సిపిఎం నాయకులు రాము మాట్లాడుతూ నాగరాజు మృతిపై పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు జరపాలన్నారు. వైద్యులు సైతం ఒత్తిళ్లకు తలొగ్గకుండా పోస్టుమార్టం రిపోర్టును నిజాయితీగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాగరాజు తండ్రి నారాయణప్ప, అత్త గంగమ్మ, అక్క కవిత, చిన్నాయన గంగప్ప, కుటుంబ సభ్యులు, బంధువులు సోమయ్య, బాలు, రాము తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక లేక చెరువులో ఖననం



చెరువులో శవాన్ని పూడ్చుతున్న దళితులు

సోమందేపల్లి : మండల పరిధిలోని తుంగోడు గ్రామంలో దళితులకు శ్మశానవాటిక లేక స్థానిక చెరువులో శవాన్ని పూడ్చిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఈ విషయంపై కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ మండలంలోని చాలా గ్రామాల్లో దళితులకు శ్మశానవాటిక లేదని పలుమార్లు మండల అధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. 1235 జిఒ ప్రకారం దళితులు ఉన్న ప్రతి గ్రామంలో శ్మశానవాటికకు రెండెకరాల స్థలం కేటాయించి, అందులో బోరు, గృహాన్ని ఏర్పాటు చేయాలని ఉన్నా ఆచరణకు నోచుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఇకనైనా శ్మశానవాటికలకు స్థలం కేటాయించకపోతే దళితులతో కలిసి తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరవధిక పోరాటం చేస్తామని హెచ్చరించారు.

ప్రజల సమస్యలు పురష్కరించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-గాండ్లపెంట

రైతులు, ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే పివి.సిద్ధారెడ్డి అధికారుల ను ఆదేశించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. పలువురు రైతులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తేగా వాటిని వెంటనే పరిష్కరించాలని తహశీల్దార్ హమీద్ బాషాను ఆదేశించారు. జగనన్న గృహాల బిల్లులు కావడం లేదని లబ్ధిదారులు ఫిర్యాదు చేయగా వెంటనే మంజూరు చేయాలని హౌసింగ్ ఎఇ జయచంద్రారెడ్డిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఇఒ కృష్ణానాయక్‌లక్ష్మిప్రియ, పశువైద్యాధికారి చెన్నకేశవులు నాయక్, సిఎస్‌డిటి సురేంద్ర, ఎంపిపి జగన్మోహన్, వైసిపి మండల కన్వీనర్ జి.రవీంద్రారెడ్డి, జడ్పిటిసి భాస్కర్‌రెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యుడు ఎస్.ఫయాజ్‌అలీ, సింగిల్‌విండో అధ్యక్షుడు ఎస్పీ హైదర్, సర్పంచులు ఎస్.రహమతుల్లాబి. రవీంద్రనాయక్, పలు శాఖ అధికారులు, విఆర్‌ఒలు, రైతులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

టిడిపి-జనసేన ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలోని బాలాజీనగర్ టిడిపి కార్యాలయంలో సోమవారం 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' పై టిడిపి-జనసేన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా టిడిపి-జనసేన ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని ఇంటింటికీ తీసుకెళ్లి వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి పార్టీల అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలన్నారు.మినీ మేనిఫెస్టో, ఉమ్మడి మేనిఫెస్టోలో ప్రకటించిన విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి ఉమేష్,టిడిపి నాయకులు బిఎస్.గురుమూర్తి, మనోహర్, లక్ష్మీనారాయణ, దాసిరెడ్డి, కుమారస్వామి, గణేష్, కృష్ణమూర్తి, మల్లికార్జున, జనసేన నాయకులు శివాజీ, రంగస్వామి, రవికుమార్, కళ్లుమర్రి నాగరాజు, నరేష్, నాగరాజు, కాంతరాజు, అనుబంధ సంఘాల నాయకులు, పెద్దఎత్తున పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గుండుమల తిప్పేస్వామి

కరువు రైతాంగాన్ని ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి-తనకల్లు

రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కరువు రైతాంగాన్ని ఆదుకోవాలని ఎపి రైతు సంఘం, సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వారు తహశీల్దార్ శోభసువర్ణమ్మకు వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి మాట్లాడుతూ వివిధ రకాల పంటలు వేసి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం, పంటలబీమా వర్తించేలా చర్యలు చేపట్టాలని, కౌలు రైతులను ఆదుకోవాలని కోరారు. నేడు రాష్ట్రవ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో అన్ని మండల రెవెన్యూ కార్యాలయాల వద్ద తహశీల్దార్లకు వినతిపత్రాలు అందజేసే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలు గా ప్రకటించాలన్నారు. భూ పంపిణీలో అర్హులందరికీ భూమి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మండల సిపిఎం నాయకులు శివన్న, ఎస్‌వి.రమణ, శ్రీనివాసులు, వెంకటేష్, రాజన్న, ఆదెప్ప, చలపతి, లక్ష్మీనారాయణ, రామచంద్ర, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న సిడిపిఒ నాగమల్లేశ్వరి

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

మడకశిర : బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని సిడిపిఒ నాగమల్లేశ్వరి తెలిపారు. పట్టణంలోని మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో సోమవారం ఆర్‌డిటి, మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆర్‌డిటి సెక్టార్ టీం లీడర్ ఆదినారాయణ అధ్యక్షతన బాలల హక్కుల ముగింపు వారోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సిడిపిఒ నాగమల్లేశ్వరి, ఎంఇఒ శ్రీనివాసభాస్కర్ , ఎస్ఐ లోకేష్, మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ హెప్సిబా హాజరయ్యారు. చిన్నారులకు లఘుచిత్రాల ద్వారా బాల్య వివాహాలు, లైంగిక వేధింపులను ఎలా ఎదుర్కోవాలో అవగాహన కల్పించారు.

23న తాడిమర్రికి ఎంపి రామ్మోహన్‌నాయుడు రాక

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఎలాంటి స్వార్థం లేకుండా కేవలం ప్రజల్లో మార్పుకోసమే మొక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ స్పష్టం చేశారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. శ్రీరామ్ మాట్లాడుతూ పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో గ్రామాల్లో మొక్కల పంపిణీ జరుగుతోందన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపి రామ్మోహన్ నాయడు ఈ నెల 23వ తేదీ తాడిమర్రి మండలంలో జరిగే మొక్కల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటార న్నారు. ఫ్యాక్షన్‌కి వ్యతిరేకంగా చెట్లు నరికే విష సంస్కృతికి ముగింపు పలకాలన్న ఉద్దేశంతో చేపట్టిన మొక్కల పంపిణీ కార్యక్రమం ఎందరినో కదిలిస్తోందన్నారు.

బత్తలపల్లి : మొక్కలు నాటి సంరక్షించడం ద్వారా భవిష్యత్తులో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు పండి సస్యశ్యామలం అవుతుందని పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. తాడిమర్రి మండల పరిధిలోని ఎం.అగ్రహారంలో పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కలను శ్రీరామ్ ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కూచి రాము, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు ఎర్రాయపల్లి చాల్లా శ్రీనివాసులు, ముసుకు శ్రీనివాసులు, నిడిగిల్లు నాగభూషణ, నాయకులు సాయి, శివంపల్లి హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.



మొక్క అందజేస్తున్న పరిటాలశ్రీరామ్



అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న మిత్రులు

విఆర్‌ఎం గ్రూప్ అధినేతకు సన్మానం

గోరంట్ల : మండల పరిధిలోని పాలసముద్రం సమీపంలో గ్రాండ్ విల్లాస్ నిర్మించిన విఆర్‌ఎం గ్రూప్ ఛైర్మన్ మాగులూరు వెంకటేశ్వరరావు ఇటీవల దుబాయ్‌లో రియల్ ఎస్టేట్ విభాగంలో లైఫ్ టైం అఛీవ్‌మెట్ అవార్డు అందుకున్నారు. దీంతో గ్రేట్ వే ఇంటర్నేషనల్ స్కూల్‌లో సోమవారం విఆర్‌ఎం గ్రూప్ సిబ్బంది, స్కూల్ సిబ్బంది, మిత్రులు శ్రేయోభిలాషులు వెంకటేశ్వరరావును ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ వెంకటేశ్వరరారు రియల్ ఎస్టేట్ విభాగంలో అంచెలంచెలుగా ఎదిగి వందలాది మందికి ఉపాధి కల్పిస్తున్నారని కొనియాడారు. ప్రపంచ స్థాయిలో అవార్డు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

విద్యా పథకాల్లో నిబంధనల మార్పు తగదు

మడకశిర : విద్యాదీవెన, వసతిదీవెన పథకాల్లో నిబంధనల మార్పు తగదని, జాయింట్ అకౌంట్ నిబంధనను రద్దు చేయాలని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మురళిబాబు డిమాండ్ చేశారు. పట్టణంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 23వ తేదీ లోపు విద్యార్థి, తల్లి పేరుతో జాయింట్ అకౌంట్ తెరిస్తేనే ఆయా పథకాలు వర్తిస్తాయని నిబంధన పెట్టడం సమంజసం కాదన్నారు. విద్యార్థుల సంఖ్యను తగ్గించాలనే ఉద్దేశంతోనే వైసిపి ప్రభుత్వం అర్థంపర్థం లేని నిబంధనలు పెడుతున్నంని ధ్వజమెత్తారు. ఇకనైనా కొత్త నిబంధనను రద్దు చేసి యథావిధిగా విద్యా దీవెన, వసతి దీవెన అమలు చేయాలని డిమాండ్ చేశారు.

'వై ఎపి నీడ్స్ జగన్'ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

'వై ఎపి నీడ్స్ జగన్' కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని తిక్కస్వామినగర్ సచివాలయం వద్ద 7వ వార్డులో ప్రజలకు చేకూరిన లబ్ధిని చూపే బోర్డును మున్సిపల్ ఛైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ ఛైర్మన్ వేముల జయరాంరెడ్డి, షేక్ శంషాద్‌బేగం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఏ ప్రభుత్వం చేయని అభివృద్ధి ని వైసిపి ప్రభుత్వం చేసిందన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి గతంలో ఎవరూ చేయని అభివృద్ధిని చేసి చూపించారన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు గడ్డం వరలక్ష్మి, బ్రహ్మయ్యాఆచారి, మాసపల్లి సాయికుమార్, గడ్డం రంగా, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బత్తలపల్లి : పేదలకు సంక్షేమ ఫలాలు అందాలన్నా, లబ్ధి చేకూరాలన్నా మళ్లీ జగనే సిఎం కావాలని, ఈ విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఎంపిపి బగ్గిరి త్రివేణి, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని పోట్లమర్రి గ్రామ సచివాలయంలో సోమవారం సర్పంచి అక్కిం దామోదర్ అధ్యక్షతన 'వై ఎపి నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, గృహసారథులు, వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి గత ప్రభుత్వానికి, వైసిపి ప్రభుత్వానికి మధ్య తేడాలను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం సచివాలయ ఆవరణలో సంక్షేమ పథకాల లబ్ధిని తెలిపే పోస్టర్‌ను ఆవిష్కరించారు. యువనేత దినేష్‌కుమార్‌రెడ్డి ఇంటి సమీపంలో 'మా నమ్మకం నువ్వే జగన్' అనే బ్యానర్లు, వైసిపి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇఒఆర్‌డి దివాకర్, పంచాయతీ కార్యదర్శి ప్రకాష్, సచివాలయాల మండల కన్వీనర్, బయపురెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ ఈడిగ కాకప్ప, చెన్నకృష్ణారెడ్డి, కోఆప్షన్ మెంబర్, నాయకులు హనుమంతరెడ్డి, వెంకటరెడ్డి, ఆంజనేయులు, వెంకటనారాయణరెడ్డి, చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి

నూర్‌బాషాల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాబా సాహెబ్



బాబా సాహెబ్

ముదిగుబ్బ : నూర్‌బాషా దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ముదిగుబ్బలోని పాతూరుకు చెందిన ప్రథమ చికిత్స వైద్యుడు రాళ్లపల్లి బాబాసాహెబ్‌ను నియమించారు. పుట్టపర్తిలో సోమవారం నిర్వహించి న సమావేశం లో రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆయనను ఎంపిక చేశారు. నియామకానికి సహకరించిన జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గఫూర్‌కి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అన్ని కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని రాష్ట్ర నూర్‌బాషా దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో దూదేకుల సామాజిక వర్గం ప్రజలు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో గ్రామ పరిపాలనా వ్యవస్థ నిర్వీర్యం

ప్రజాశక్తి-పెనుకొండ

75 ఏళ్లుగా దేశ పురోగతికి కారణమైన పంచాయతీ, సర్పంచి వ్యవస్థను జగన్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ పేర్కొన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ గ్రామ సచివాలయాలు, వాలంటీర్ వ్యవస్థను తెచ్చి పంచాయతీ భవనాలకు సచివాలయ బోరుల్డు వేసి పంచాయతీ వ్యవస్థకు అడ్రస్ లేకుండా, సర్పంచులు, వార్డు మెంబర్లకు స్థానమే లేకుండా చేసి గ్రామ పరిపాలనా వ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు. 14, 15వ ఆర్థిక సంఘం నిధులను సర్పంచులకే తెలియకుండా కాజేశారన్నారు. సచివాలయాలను సొంత పార్టీ కార్యాలయాలుగా మార్చుకొని పార్టీ జెండా, ఎజాండేయే ధ్యేయంగా పని చేసేలా అధికారులను సైతం ఏమార్చుతున్నారని మండిపడ్డారు. సమావేశంలో డివి ఆంజనేయులు, శ్రీరాములు, సూర్యనారాయణ, ప్రసాద్, రంగప్ప, హనుమంతరాయుడు, అరుణ్‌కుమార్‌రెడ్డి, త్రివేంద్రనాయుడు, బుసప్ప, చిన్న పోతన్న, వీరచిన్న, శెట్టిపల్లి మంజు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సవితమ్మ

ఇందిరాగాంధీకి నివాళి

ముదిగుబ్బ : స్థానిక కాంగ్రెస్ నాయకులు సోమవారం ఇందిరా గాంధీ చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల కన్వీనర్ బాసినేని ప్రభాకర్ మాట్లాడుతూ ఇందిరాగాంధీ ప్రవేశపెట్టిన పథకాలు నేటికీ ప్రజల గుండెల్లో నిలిచిపోయాయన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నిస్సార్ అహమ్మద్, నాగరాజు, ఆదినారాయణ పాల్గొన్నారు.

దేవాదాయ భూములను కాపాడండి

బుక్కపట్నం : స్థానిక బసవేశ్వరస్వామి ఆలయానికి చెందిన మాన్యం భూమి అన్యాక్రాంతానికి గురికా కుండా కాపాడాలని సిపిఎం మండల కార్యదర్శి బ్యాళ్ల అంజి కోరారు. ఈ మేరకు సోమవారం గ్రీవెన్స్‌డేలో తహశీల్దార్ కరుణాకర్‌కు వినతి పత్రం సమర్పించారు. అంజి మాట్లాడుతూ బసవేశ్వర స్వామి ఆలయానికి సంబంధించి మాన్యం భూమి 15 ఏళ్లుగా బీడుగా ఉందని, దీంతో కొందరు అసైన్డ్ భూమిగా మార్చి అన్యాక్రాంతం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారని రెవెన్యూ అధికారులు స్పందించి ఆ భూమిని కాపాడాలని కోరారు.

కళ్యాణమండం నిర్మాణానికి విరాళం

మడకశిర : రొళ్ల మండల పరిధిలోని కాల్వేపల్లి గ్రామంలో లక్ష్మీరఘునాథస్వామి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కళ్యాణ మండపం నిర్మాణానికి సోమవారం దాతలు రూ. 70 వేలు విరాళం అందించినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు రాజన్న, శ్రీరంగప్ప, తిమ్మప్ప, రమేష్, నాగరాజు, పుట్టన్న తెలిపారు. అమరాపురం మండలం శివరం గ్రామానికి చెందిన సాదర గౌడ కులస్తులు రూ. 70వేలు అందజేశారని ప్రధాన అర్చకులు రంగనాథ్ తెలిపారు.

అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలి

ధర్మవరం టౌన్ : పట్టణ సమీపంలోని కేతిరెడ్డికాలనీ ఎల్-4లో టిడ్కో ఇళ్ల ఎదురుగా ఉన్న ఆర్‌అండ్‌బి స్థలంలో అక్రమ కట్టాడాలను అరికట్టాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సిపిఎం పట్టణ కార్యదర్శి నాగార్జున, రైతు సంఘం జిల్లా నాయకులు జంగాలపల్లి పెద్దన్న, సిపిఎం సీనియర్ నాయకులు ఎస్ఎహెచ్ బాషా, సిఐటియు నాయకులు అయూబ్‌ఖాన్, ఎల్.ఆదినారాయణ ఆర్‌అండ్‌బి ఇఇ సంజీవయ్యకు వినతిపత్రం అందజేశారు.



ఆర్‌అండ్‌బి ఇఇకి వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

కార్మికుల సమస్యలపై ధర్నా

ధర్మవరం టౌన్ : సమస్యలను పరిష్కరించాలని డిమాం డ్ చేస్తూ సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు సిఎం జగన్ ఇచ్చిన హామీని అమలు చేయాలని సోమ, మంగళవారాల్లో ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. వారు మాట్లాడుతూ కార్మికులతో వెట్టి చాకిరీ చేయిస్తూ చాలీ చాలనీ జీతాలు ఇస్తుండడంతో కుటుంబాలు గడవక అవస్థలు పడుతున్నారన్నారు. పారిశుధ్య కార్మికులకు ఆదాయ పరిమితితో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్న వాగ్దానం అటకెక్కించారన్నారు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

సాగునీరివ్వాలని వినతి

బుక్కపట్నం : బుక్కపట్నం చెరువు కింద రైతుల పంట పొలాలకు సాగునీరు వదలాలని టిడిపి జిల్లా కార్యదర్శి సామ కోటి ఆదినారాయణ రైతులతో కలిసి తహశీల్దార్ కరుణాకర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడు తూ బుక్కపట్నం చెరువు కింద ఉన్న భూములు బీడుగా మారిపోతున్నాయని, వెంటనే అధికారులు సాగు నీరు వదిలి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మల్లిరెడ్డి, నాయకులు బాలు, సయ్యద్‌బాషా, గొర్ల కృష్ణ, రైతులు శ్రీరాములు, సంజీవరాయుడు, జయరాం, చంద్రశేఖర్, వెంకటేష్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు



తహశీల్దార్‌కు వినతి పత్రం అందచేస్తున్న టిడిపి నాయకులు

బాబా జయంతి వేడుకల నిర్వహణలో ప్రభుత్వం విఫలం : పల్లె

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్ : సత్యసాయిబాబా జయంతి వేడుకలు నిర్వహించడంలో ప్రభుత్వం, జిల్లా అధికారులు విఫలమయ్యారని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వేడుకలకు హాజరయ్యే భక్తులకు తాగునీరు, మొబైల్ టాయిలె ట్స్, శానిటేషన్, తదితర మౌలిక సదుపాయాలు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎపి గవర్నర్‌తో పాటు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, విఐపిలు, వివిఐపిలు, దేశ, విదేశీ భక్తులు రానున్న తరుణంలో రోడ్ల మరమ్మతులు చేపట్టలేదని, విద్యు త్ దీపాలు ఏర్పాటు చేయలేదన్నారు. నెల రోజుల ముందే అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశమై ఏర్పాట్లు, నిధుల విషయంపై చర్చించాల్సి ఉండగా అధికార యంత్రాంగం తూతూ మంత్రంగా సమీక్ష చేసిందన్నారు. బాబా చిత్రపటాలను తొలగించి ఆ స్థలంలో వైసిపి జెండాలను కట్టడం మంచిది కాదని హితవు పలికారు.

ఆత్మీయ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఈ నెల 26వ తేదీ రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని ఆత్మీయ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామని ట్రస్టు ఛైర్మన్ శెట్టిపి జయచంద్రారెడ్డి, వైస్ ఛైర్మన్ శెట్టిపి సూర్యప్రకాష్‌రెడ్డి, డైరెక్టర్లు పరమేష్, రాజశేఖర్ తెలిపారు. వారు మాట్లాడుతూ వ్యాసరచనలో 'డాక్టర్. బి.ఆర్ అంబేద్కర్- భారత రాజ్యాంగ నిర్మాత', చిత్రలేఖనంలో 'సేవ్ గర్ల్ చైల్డ్' అంశాలపై 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఒక్కో పాఠశాల నుంచి ముగ్గురు మాత్రమే రావాల్సి ఉంటుందన్నారు. వివరాల కోసం 90309 44717లో సంప్రదించాలని తెలిపారు.

పారిశుధ్యం లోపిస్తే చర్యలు

పుట్టపర్తి రూరల్ : పారిశుధ్యం లోపిస్తే చర్యలు తప్పవని సంబంధిత అధికారులు, సిబ్బందిని జిల్లా ఇన్‌ఛార్జి పంచాయతీ అధికారి శివకుమారి హెచ్చరించారు. ఆమె సోమవారం మండల పరిధిలోని వెంగళమ్మ చెరువు గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. సత్యసాయి జయంతి సందర్భంగా జరుగుతున్న పలు ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. వీధుల్లో మురుగు ప్రవహిస్తే వ్యాధులు ప్రబలతాయని, అందువల్ల ముందస్తుగానే పారిశుధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. ఆమె వెంట మండల విస్తరణ అధికారి అశోక్ కుమార్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి హనుమంతురెడ్డి, తదితరులు ఉన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థులు జ్ఞానం పెంచుకోవటానికి గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఎంపిడిఒ నరేంద్ర కుమార్ అన్నారు. 56వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలో గ్రంథాలయ అధికారి శ్రీధర్ ఆధ్వర్యంలో ముగింపు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు, సామాజిక సేవకుడు ఉమర్ ఫారూక్ ఖాన్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కవి, రచయితలు కల్లూరు రాఘువేంద్రరావు, ఆంధ్రరత్న గంగాధర్, సిబ్బంది గుణప్రియ, ఫయాజ్, ఉపాధ్యాయులు నరేష్ నాయక్, నరసింహులు, శైలజా దేవి, మాధవిదేవి పాల్గొన్నారు.

కొత్తచెరువు : విద్యార్థులు డిజిటల్ గ్రంథాలయాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా ఓపెన్ స్కూల్స్ కోఆర్డినేటర్ లాజర్. ఆర్డిటి ఎటిఎల్ సుధాకర్ తెలిపారు. స్థానిక గ్రాంథాలయంలో సోమవారం గ్రంథాలయ అధికారి కె.జయరాం ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. వ్యాసరచన, వక్తృత్వ, తదితర పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ముఖ్య అతిథులతో పాటు స్వీపర్ మున్నీకి శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనంతలక్ష్మి, శివయ్యచౌదరి, ప్రభాకర్, రిటైర్డ్ ఉద్యోగులు మహమ్మద్, కిష్టప్ప, పాఠకులు పాల్గొన్నారు

మడకశిర రూరల్ : పట్టణంలోని గ్రంథాలయం వద్ద అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. హైస్కూల్ హెచ్ఎం సత్యవతి పార్వతమ్మ వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయంలో పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు.

అమరాపురం : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక జడ్పి హైస్కూల్‌లో నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు హెచ్ఎం రఘు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రప్ప, నరసింహమూర్తి, ఎంజేరప్ప, లింగప్ప, తిప్పేస్వామి, మాలిం గప్ప, గ్రంథాలయ సిబ్బంది ఇబ్రహీం, బిడిసిలు వీరకేతప్ప, మారెన్న, నాగరాజు పాల్గొన్నారు.

రొద్దం : స్థానిక గ్రంథాలయంలో అధికారి నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపిపి చంద్రశేఖర్, ఎస్ఐ వలిబాషా, జడ్పీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయులు



కొత్తచెరువు : విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసిన అతిథులు

నాగిరెడ్డి, హరిచంద్రనాయక్, టీచ్ హై స్కూల్ హైచ్ఎం తిమ్మారెడ్డి, మారుతిరెడ్డి, సత్యశేఖర్‌రెడ్డి, తదితరులు హాజరయ్యారు. అనంతరం పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

గాండ్లపెంట : మండల పరిధిలోని కటారుపల్లి జడ్పి హైస్కూల్‌లో గ్రంథాలయ వారోత్సవాల పోటీల విజేతలకు గ్రంథాలయ అధికారి పర్వీన్‌బాను ఆధ్వర్యంలో ఎంఇఒ-2 శ్రీనివాసులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్ఎం జయరాం, ఉపాధ్యాయులు పామిడి ముంతాజ్ అలీ, గంగాధర్, రాజగోపాల్, విశ్వనాథ్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : పట్టణంలోని బాబు జగ్జీవన్ రామ్ నగర్‌లో ఉన్నా ప్రధాన గ్రంథాలయంలో అధికారిణి అంజలి సౌభాగ్యవతి ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఇఒ గోపాల్ నాయక్ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివ, కాంతమ్మ, మురళి, ముత్యాలప్ప, ఎల్ఐసి నాగరాజు, నారాయణస్వామి, గ్రంథాలయ సిబ్బంది శివమ్మ, రమణనాయక్, గంగాధర్, ముకుంద, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : స్థానిక గ్రంథాలయంలో అధికారి కె.మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జడ్పి హైస్కూల్ హెచ్ఎం ఖాదర్ వలి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం లక్ష్మీబాయి, ఉర్దూ స్కూల్ హెచ్ఎం తబుసం బేగం పాల్గొన్నారు. పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

బత్తలపల్లి : స్థానిక గ్రంథాలయంలో వివిధ పోటీల విజేతలకు అధికారిణి రాజేశ్వరి బహుమతులు ప్రదా నం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాధవి, శైలజ, శ్రీకాంత్, గ్రంథాలయ సిబ్బంది. విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : గ్రంథాలయ అధికారి మూడే బొజ్జేనాయక్ ఆధ్వర్యంలో స్థానిక కెజిబివిలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుక నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఇఒ రమణప్ప హాజరై వివిధ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులకు మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుళ్లాయప్ప, ఉపాధ్యాయినులు కోమల, శంకరమ్మ పాల్గొన్నారు.

పెనుకొండ : పట్టణంలోని గ్రంథాలయంలో అధికారి కె.మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బషీర్ అహమ్మద్, లైబ్రేరియన్ రామచంద్రరావు, గర్ల్స్ హై స్కూల్ ఉపాధ్యాయురాలు ఆశాజ్యోతి, రిటైర్డ్ ఉపాధ్యాయులు షమీవుల్లా హాజరయ్యారు. వారు వివిధ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేయడంతో పాటు పిల్లలకి మిఠాయిలు పంపిణీ చేశారు.

గుడిబండ : స్థానిక గ్రంథాలయంలో అధికారి కమలనాభరావు ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపిడిఒ రామారావు, జడ్పిటిసి బూతరాజు హాజరయ్యారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విశిష్ట అతిథులను గ్రంథాలయ అధికారి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోవిందప్ప, తెలుగు పండితులు గంగాధర్, రామకృష్ణ, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : స్థానిక గ్రంథాలయ శాఖ పరిధిలో నిర్వహించిన పోటీల విజేతలకు గ్రంథాలయశాఖ అధికారి మల్లికార్జున ఆధ్వర్యంలో అతిథులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ హైస్కూల్ హెచ్ఎం వివేకనందమూర్తి, రఘు, ఎర్రిస్వామి, అరబ్జాన్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు రెగ్యులర్ బెయిల్ మంజూరుపై సర్వత్రా హర్షం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

టిడిపి అధినేత చంద్రబాబును వైసిపి ప్రభుత్వం, సిఎం జగన్ అక్రమకేసులు బనాయించి ఇబ్బందులు పెట్టాలనుకున్నా చివరికి కోర్టులో న్యాయమే గెలిచిందని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన సోమవారం పట్టణంలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడేతూ 'స్కిల్' కేసులో హైకోర్టు చంద్రబాబుకు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేయడాన్ని స్వాగతిస్తూ హర్షం వ్యక్తం చేశారు. హైకోర్టు నిర్ణయంతో ప్రజలకు న్యాయస్థానంపై నమ్మకం మరింత పెరిగిందన్నారు. న్యాయస్థానాలు ఉన్నాయి కాబట్టే రాష్ట్రంలో ప్రతిపక్షాల మనుగడ సాధ్యమవుతోం దన్నారు.




విలేకరులతో మాట్లాడుతున్న చిలకం

పెనుకొండ : చంద్రబాబుకు రెగ్యులర్ మంజూరవడంతో పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద టిడిపి జిల్లా అధ్యక్షులు బికె. పార్థసారథి ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచి పెట్టారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మడకశిర రూరల్ : సత్యం గెలిచి, అసత్యంపై యుద్ధం మొదలైందని మాజీ ఎమ్మెల్యే ఈరన్న పేర్కొన్నారు. చంద్రబాబుకు రెగ్యులర్ బెయిల్ మంజూరు కావడంతో ఆయన పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు వైసిపి ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టిందని రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు' అన్నారు.

ముదిగుబ్బ : చంద్రబాబుకు రెగ్యులర్ బెయిల్ మంజూరు కావడంతో స్థానిక ఎన్టీఆర్ సర్కిల్లో టిడిపి నాయకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తుమ్మల మనోహర్, చికెన్ తిరుపాల్, మహబూబ్‌పీరా, మల్లెల నారాయణస్వామి, కృష్ణమూర్తి యాదవ్, గడ్డం మోహన్, గోనుగుంట్ల రామంజి, ఉత్తమనాయుడు, రఫీ, ధరూరు ఆది, చరణ్, అనీఫ్, చంద్ర, శివ, వెంకటాద్రి, నాయుడు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం : 'స్కిల్' కేసులో చంద్రబాబుకు రెగ్యులర్ బెయిల్ మంజూరవడంతో టిడిపి నాయకులు స్థానిక అంబేద్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి, తేరు కూడలిలో బాణసంచి కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మండల కన్వీనర్ మల్లిరెడ్డి, సాకే యశోద, లావణ్యాగౌడ, బాలు, సుబ్బారెడ్డి. సయ్యద్‌బాషా, గొర్ల కృష్ణ, సుధీర్, మంజు, సతీష్, జనసేన కార్యకర్తలు బాలాజీ, మహేష్, మన్సూర్, తదితరులు పాల్గొన్నారు.



పెనుకొండలో బికె పార్థసారథి ఆధ్వర్యంలో సంబరాలు చేసుకుంటున్న తెలుగుతమ్ముళ్లు

పుట్టపర్తి క్రైమ్ : స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. సామకోటి మాట్లాడుతూ టిడిపి అధినేత చంద్రబాబుకి హైకోర్టు రెగ్యులర్ బెయిలు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షులు జయప్రకాష్, కోనంకి గంగాధర్ నాయుడు, నాలుగో వార్డ్ ఇంచార్జ భీమినేని కిష్టప్ప, హరినాథ్ చౌదరి, టీఎన్ఎస్ఎఫ్ పుట్టపర్తి కార్యదర్శి సాయి ప్రకాష్, నాగరాజు, వెంకట్ రాముడు తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : 'స్కిల్' కేసులో ఎపి హైకోర్టు సోమవారం టిడిపి అధినేత చంద్రబాబుకు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేయడం పట్ల టిడిపి శ్రేణులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండు మల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి ఆధ్వర్యంలో తెలుగుతమ్ముళ్లు టపాసులు పేల్చి స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో కృష్ణమూర్తి, మల్లికార్జున, గురుమూర్తి, మండల కన్వీనర్లు దాసి రెడ్డి, మనోహర్, లక్ష్మీనారాయణ, కుమారస్వామి, గణేష్, నాయకులు రవికుమార్, కళ్లుమర్రి నాగరాజు, నరేష్ కన్నా, నాగరాజు, కాంతరాజు, బుడ్డయ్యపాలెం ప్రసాద్, వడ్డే రఘురాం, బాలకృష్ణ, రంగస్వామి, వెంకటాద్రి, నరసింహారెడ్డి, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తచెరువు : చంద్రబాబుకి రెగ్యులర్ బెయిల్ మంజూరవడం పట్ల టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఎస్.శ్రీనివాసులు, మండల కన్వీనర్ రామకృష్ణ, లక్ష్మీనారాయణ, నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక బుక్కపట్నం రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి హర్షం వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం కుట్ర పూర్వకంగానే అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురి చేస్తుందన్నారు. వాస్తవాలు లేనందున న్యాయస్థానం రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసిందన్నారు, అనంతరం ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, టిడిపి నాయకులు సుధాకర్, బైరాపురం లక్ష్మీనారాయణ, ఆలకుంట శ్రీనివాసులు, డిపో భాస్కర్, బోయ రాజు, సైకిల్ షాపు బాబాషర్ఫుద్దీన్, సుబ్బరాయుడు, శ్రీనాథ్, భైరవుడు, తదితరులు పాల్గొన్నారు.

మంజూరైన వంతెన వద్ద నిరసనా.? : వైస్ ఛైర్మన్

ప్రజాశక్తి-హిందూపురం

నిధులు మంజూరై పనులు ప్రారంభి ంచిన వంతెన వద్ద, నిర్మాణం చేపట్టాలని ప్రతిపక్షాలు ఆందోళన చేయడం హాస్యాస్పదంగా ఉందని మున్సిపల్ వైస్ ఛైర్మన్ బలరామిరెడ్డి తెలిపారు. పురపాలక సంఘం పరిధిలో ఉన్న పెన్నా నది వంతెన వద్ద టిడిపి, జనసేన పార్టీల నాయకులు సోమవారం వంతెన నిర్మాణం చేపట్టాలని చేసిన ఆందోళనపై మున్సిపల్ వైస్ ఛైర్మన్, పలువురు కౌన్సిలర్లు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ విషయంపై స్థానిక వైసిపి కార్యాలయంలో విలేకరులు సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. పురపాలక సంఘ పరిధిలో ఉన్న పెన్నా నది వంతెన గత 20 సంవత్సరాల క్రితమే శిథిలావస్థకు చేరుకుందన్నారు. ఈ విషయం తెలిసినప్పటికీ అధికారంలో ఉన్న టిడిపి నాయకులు ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు వంతెన తెగిందన్నారు. వెంటనే ఈ విషయాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దష్టికి తీసుకువెళ్లి రూ. 10 లక్షలతో తాత్కాలిక ఐరన్ బ్రిడ్జ్ ఏర్పాటు చేయడంతో పాటు నూతన వంతెన నిర్మాణానికి రూ.80 లక్షలు మంజూరు చేయించామన్నారు. సాంకేతిక సమస్యల వల్ల సకాలంలో పనులు పూర్తి కాలేదన్నారు. వచ్చే ఏప్రిల్‌లోపు నూతన వంతెన నిర్మాణ పనులు పూర్తి అవుతాయన్నారు. ఈ విషయం తెలిసినప్పటికీ ప్రతిపక్ష పార్టీలు కేవలం తాము ఆందోళన చేయడం వల్లే వంతెన నిర్మాణం జరిగిందని ప్రజలకు చూపించడానికి నిరసన తెలిపారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ఇలాంటి పనికిమాలిన ఆందోళనలు పక్కన పెట్టి ప్రజలకు ఉపయోగపడే విధంగా పనులు చేయాలన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు షాజియా, మల్లికార్జున, గిరీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని వైద్యఖర్చులకు ఆర్థికసాయం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని బిఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కాడిశెట్టి కావ్య కొంత కాలంగా లివర్ ఇన్ఫెక్షన్ బాధపడుతుంది. దీంతో హెచ్ఎం ఉమాపతి, ఉపాధ్యాయులు విరాళాలు సేకరించి సోమవారం పాఠశాలలో రూ. 69,625ను కావ్యకు అందజేశారు. హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థిని ఆపరేషన్‌కు రూ. 30లక్షలు ఖర్చు అవుతుందని, దాతలు ఆదుకోవాలని కోరారు. దాతలు 81063 13018 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

బాలికల జూడో లీగ్ పోటీలకు ధర్మవరం విద్యార్థినులు

ధర్మవరం టౌన్ : కేరళలో ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు జరిగే ట్రిడీ ఖేలో ఇండియా బాలికల జూడో లీగ్ పోటీలకు ధర్మవరం విద్యార్థినులు ఎంపికైనట్టు జూడో కోచ్ ఇనాయాత్‌బాషా తెలిపారు. కొత్తపేట బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఆర్చన, ఉష, రవి, 8వ తరగతి చదువుతున్న సాయిప్రియ, 7వతరగతి చదువుతున్న యువసంధ్య, సుష్మిత ఈ నెల 10, 11 తేదీల్లో అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి జూడో లీగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచారన్నారు. వీరిని హెచ్ఎం మేరీవరకుమారి, కోచ్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

అంతర్ జిల్లా బాస్కెట్ బాల్ పోటీలకు తరుణ్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

అండర్-17 అంతర్ జిల్లా బాస్కెట్‌బాల్ పోటీలకు పట్టణంలోని సుందరయ్యనగర్ శ్రీగణేష్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న డి.తరుణ్ ఎంపికయ్యాడని హెచ్ఎం లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. ఆయన సోమవారం పాఠశాలలో మాట్లాడుతూ గత నెల అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాలలో జరిగిన ఎంపిక పోటీల్లో టి.తరుణ్ ప్రతిభ కనబరిచాడని తెలిపారు. తరుణ్‌ను హెచ్ఎంతో పాటు ఫిజికల్ డైరెక్టర్ వీర, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, పాఠశాల కమిటీ అభినందించారు.